# సత్యమే ప్రత్యక్ష పరమాత్మ

**క్రమము తప్పక మింట ప్రతిదినంబును భాను**
**డుదయాస్తమయముల నొందనేల**
**గగనంబునకు కాంతి కైసేయు తారకల్**
**పగలు మాత్రము దాగు భంగియేల**
**క్షణమైన విశ్రాంతి కనక తా పవనుండు**
**జీవకోటిని బ్రోవ వీవనేల**
**అనిశంబు కిలకిల ధ్వనులచే నదులన్ని**
**సరగున ప్రవహించు చందమేల**
**ప్రకృతిలో నెందుజూచిన భ్రమయె యేల**
**పృథివి ధన కుల మత జాతి భేదమేల**
**ఎవని ఆనతి నిదియెల్ల నిట్లు జరుగు**
**ఎవని ఆజ్ఞకు బద్ధుడో ఎవరు ప్రభువో**
**అతని ఆజ్ఞను పాలింప నరయరండు**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?**

ప్రేమస్వరూపులారా! ఈ ప్రకృతిలో ప్రతి ప్రాణి, ప్రతి మానవుడు సుఖశాంతులు కావాలని ఆశిస్తున్నారు; తమ జీవితపరమావధి ఏమిటో గుర్తించాలని ప్రయత్నిస్తున్నారు. కాని, సఫలీకృతులు కాలేకపోతున్నారు. నూటికో, కోటికో ఒక్కరు దీనిని సాధించాలనే పట్టుదలతో విడువకుండా కృషి సల్పుతూ ఉంటారు. సామాన్య ప్రజలు మాత్రం జీవితపరమావధిని గుర్తించడం అసాధ్యమని భావించి, నిరంతరము లౌకిక, భౌతిక, ప్రాకృతసుఖాలకోసం ప్రాకులాడుతూ కాలమును వ్యర్థం చేస్తుంటారు. కడుపునిండుగా తిండి... కంటినిండుగా నిద్ర... ఒంటి నిండుగా వస్త్రము... ఇంటినిండుగా పిల్లలు... కళకళలాడే కళత్రముతో కిలకిలలాడుతూ కాలమును గడపడమే జీవిత పరమావధియని వారు తృప్తిపడుతుంటారు. కాని, ఇంతకుమించిన జీవితపరమావధి మరొకటున్నది.

sri sathyasai vachanamrutam

అదియే నిత్యసత్యమైన ఆనందము. అట్టి శాశ్వతానందమును తైత్తిరీయోపనిషత్తు ఒక పక్షితో పోల్చింది. ఈ పక్షియొక్క శిరస్సుకు శ్రద్ధ అని, కుడిరెక్కకు ఋతమని, ఎడమ రెక్కకు సత్యమని, దేహముయొక్క మధ్యభాగమునకు యోగమని, తోకకు మహత్తత్త్వమని పేర్లు పెట్టింది. శ్రద్ధ, ఋతము, సత్యము, యోగము, మహత్తత్త్వములనే ఐదు అంగములను అభివృద్ధిపరచు కున్నప్పుడే మానవునికి శాశ్వతానందము ప్రాప్తిస్తుంది.

**తారకము - మారకము**

శ్రద్ధ అనేది చాలా ప్రధానమైనది కనుకనే, అది తలతో పోల్చబడింది. ప్రతి జీవికి శ్రద్ధయే ప్రధానమైనది, ప్రమాణమైనది. భగవద్గీతయందుకూడా "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అని చెప్పబడింది. ఇంతేకాదు. "శ్రద్ధా స్వరూపుడను నేనే" అన్నాడు కృష్ణపరమాత్మ. శ్రద్ధ లేనివాడు ఏ చిన్న కార్యమునూ సాధించలేడు. ముఖ్యంగా ఆధ్యాత్మికమార్గమునందు శ్రద్ధ అత్యవసరం. దృఢమైన, శాశ్వతమైన, అచంచలమైన విశ్వాసమే శ్రద్ధ. శ్రద్ధతోకూడిన జ్ఞానము తారకమని, శ్రద్ధారహితమైన జ్ఞానము మారకమని ఉపనిషత్తులు పేర్కొన్నాయి. ఆధ్యాత్మికతత్త్వమునందు శ్రద్ధయే తారక మంత్రమని ప్రబోధించాయి. ఇట్టి తారక మంత్రమును మానవుడు తన హృదయంలో నిల్పుకోవాలి. ఇదియే తైత్తిరీయోపనిషత్తునందలి ప్రధాన సూత్రము. శ్రద్ధ, ఋతము, సత్యము, యోగము, మహత్తత్త్వములను అభివృద్ధిపరచుకొని తన హృదయమును పరిశుద్ధం గావించుకున్నప్పుడే మానవునికి నిజమైన జ్ఞానము లభిస్తుంది. జ్ఞానమనగా గ్రంథపరిచయం కాదు. "అద్వైత దర్శనం జ్ఞానం". ద్వైతమునందే అద్వైతము ఇమిడి యున్నది. ఇలాంటి పరమ సత్యాన్ని ప్రబోధించేదే తైత్తిరీయోపనిషత్తు.

**ఉభయభారతి ఆదర్శం**

ఆదిశంకరులవారు అద్వైతసిద్ధాంతమును ప్రచారము గావిస్తూ ఆసేతు హిమాచలపర్యంతము జైత్రయాత్ర సల్పారు. ఆయన ఉత్తరదేశమునకు వెళ్ళినప్పుడు అక్కడ మండన మిశ్రుడనే ఒక గొప్ప పండితుణ్ణి కలిశారు. వారిద్దరిమధ్య జరిగిన వాదప్రతివాదములలో మండనమిశ్రుడు ఓడిపోయాడు. మండనమిశ్రుని ధర్మపత్ని ఉభయభారతి. ఆమె సకలజ్ఞానసంపన్నురాలు. శ్రద్ధ, ఋతము, సత్యము మూడూ ఆమెలో

srisathyasaivachanamrutam

ఉన్నాయి. అందుచేత, శంకరులవారు తమమధ్య జరిగిన వాదంలో ఎవరు విజయం సాధించారనేది నిర్ణయించడానికి ఉభయభారతినే ఎన్నుకున్నారు. మండనమిశ్రుడు తాను ఓడిపోయినట్లైతే సన్యాసము స్వీకరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఉభయభారతి తన భర్తయైన మండనమిశ్రుడు ఓడిపోయినాడని, శంకరులవారు విజయం సాధించారని తీర్పు చెప్పింది. మండనమిశ్రుడు తాను చేసిన ప్రతిజ్ఞననుసరించి సన్యాసం స్వీకరించాడు. అతని అర్ధాంగి ఉభయభారతికూడా సన్యాసం స్వీకరించింది. ఈరీతిగా, సతీపతులిద్దరూ సన్యాసాశ్రమంలో ప్రవేశించి ప్రజలకు జ్ఞానబోధలు సల్పుతూ వచ్చారు.

## ఆత్మజ్యోతికి అడ్డుతగిలేది అహంకారం

జ్ఞానము లేకుండిన మానవత్వమే క్షీణించిపోతుంది. జ్ఞానము లభించవలెనంటే మానవుడు ఋతమును పాటించాలి. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం", అన్నారు. దేహము, మనస్సు, క్రియ – ఈ మూడింటి ఏకత్వమే ఋతము. ఈ మనోవాక్కర్మలే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరస్వరూపములు. మనోవాక్కాయములను పవిత్రం గావించుకొన వలెనన్న అహంకారాన్ని త్యజించాలి. దీపము దేదీప్యమానంగా వెలుగొందుతున్నప్పటికీ దానిపై నున్న గాజుచిమ్నీకి మసిపట్టినప్పుడు దాని ప్రకాశము తగ్గిపోతుంది. మసిని పూర్తిగా తుడిచివేసినప్పుడే మనకు ఆ జ్యోతి సుస్పష్టంగా కనిపిస్తుంది. అట్లే, మనస్సు చుట్టూ అహంకారమనే మసిచేరడంచేత మానవుడు తనలో ఉన్న దివ్యజ్ఞానజ్యోతిని దర్శించలేక పోతున్నాడు. అసలు అహంకారము ఎందువలన ప్రవేశిస్తుంది? తన సత్యాన్ని తాను గుర్తించుకోలేకపోవడంచేతను, ప్రాకృతమైన భావములను, సంకల్పములను పెంచుకోవడంచేతను మానవునిలో అహంకారము ప్రారంభమౌతుంది. కనుక, మొట్టమొదట ప్రాకృతమైన భావములను నిర్మూలనము చేసుకోవాలి. అప్పుడు అహంకారమునకు అవకాశమే ఉండదు. అహంకారమును తుడిచివేయకుండా మానవుడు జ్ఞాని కాజాలడు. ప్రకాశించే పవిత్రజ్యోతిని చూడాలనుకుంటే దాని చుట్టూ ఉన్న మసిని తుడిచివేయాలి కదా! అదేరీతిగా, మానవుడు తనలో ఉన్న ఆత్మజ్యోతిని దర్శించాలంటే అహంకారమును త్యజించాలి.

## అభిమాన, అహంకారములు లేనివాడే బ్రహ్మజ్ఞాని

ఉభయభారతి గంగానదికి సమీపంలో ఒక ఆశ్రమమును నిర్మించుకొని, అనేకమంది



srisathyasaivachanamrutam

స్త్రీలకు జ్ఞానబోధలు సల్పుతూ వచ్చింది. ప్రతి రోజూ తెల్లవారురుఝామునే ఆమె తన శిష్యురాండ్రతోకూడి గంగానదికి వెళ్ళి స్నానమాచరించి వచ్చేది. వాళ్ళు వెళ్ళే మార్గములో ఒక చెట్టుక్రింద ఒక సన్యాసి నివసించేవాడు. అతడు సర్వసంగపరిత్యాగి. ప్రజలు అతనిని 'బ్రహ్మజ్ఞాని' అని పిలిచేవారు. అయితే, ఉభయభారతి అతనిలో ఒక చిన్న దోషాన్ని గుర్తించింది. తాను నీరు త్రాగడానికి ఉపయోగించే బుఱ్ఱను ఎవరైనా దొంగిలిస్తారేమో అనే భయంచేత అతడు దానిని తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. అది చూసి ఆమె, "ఆహా! ఇతడు బ్రహ్మజ్ఞానియే కాని, ఇతనిలో ఒక చిన్న లోపమున్నది" అని అతనికి వినపడేలా అన్నది. "ఏమిటమ్మా ఆ లోపము?" అని శిష్యురాండ్రు ప్రశ్నించగా, "ఇతను సర్వసంగపరిత్యాగి అయిఉండి తన నీటిబుఱ్ఱను ఎవరైనా ఎత్తుకొని పోతారేమో అనే భయంచేత తలక్రింద పెట్టుకున్నాడు", అని పలికింది. ఆమె మాటలు అతనికి కోపం తెప్పించాయి. వాళ్ళు గంగలో స్నానమాచరించి తిరిగి వస్తూండగా అతడా బుఱ్ఱను తీసి ఆమె పాదాలవద్దకు విసిరేశాడు. అప్పుడు ఉభయభారతి, "అయ్యో, ఇతనిలో ఒక్కదోషమే ఉన్నదనుకున్నాను. కాని, నిజంగా రెండు దోషములున్నవి", అన్నది. ఏమిటా రెండు దోషములు? తన నీటిబుఱ్ఱను ఎవరైనా ఎత్తుకొనిపోతారేమో అని దాచుకోవటం అభిమానం. ఉభయభారతి ఈవిధంగా చెప్పిందని కోపంతో దానిని తీసి విసిరివేయడం అహంకారం. "అభిమాన, అహంకారములను త్యజించనివాడు బ్రహ్మజ్ఞాని కాజాలడు", అని ఆమె బోధించింది.

ఉభయభారతివంటి జ్ఞానస్వరూపిణులైన స్త్రీలు భారతదేశంలో అనేకమంది జన్మించారు. కాని, కలిప్రభావముచేత ఈనాడు స్త్రీలకు ఉచితస్థానము కల్పించబడటం లేదు. స్త్రీలు కదా అని వారిని అలక్ష్యము చేయకూడదు. అన్ని బాధలను ఓర్చుకొని, కష్టనష్టములను తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగిపోయే ధీరులు, గంభీరులు స్త్రీలు. వారిలో విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానములు విశేషంగా ఉన్నాయి. ప్రత్యక్షముగా గోచరముకాని సుగుణములెన్నో వారిలో ఉన్నాయి. గృహమర్యాదలను కాపాడుకుంటూ 'గృహిణి' అనే కీర్తిని నిలబెట్టుకుంటూ ప్రపంచానికంతా ధర్మప్రబోధలు చేసిన ఉభయభారతియే ఇందుకు చక్కని ఉదాహరణ.

srisathyasaivachanamrutam

**'అన్నం బ్రహ్మ రసో విష్ణుః భోక్తా దేవో మహేశ్వరః'**

మానవుడు జ్ఞానస్వరూపుడుగా రూపొందవలెనన్న "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం" అనే మూడు సూత్రములను పాటించాలి. ఈ మూడూ వరుసగా నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికవిలువలను కాపాడుతాయి. ఇవన్నీ సత్యములోనే ఇమిడి యున్నాయి. మీరు దైవమును దర్శించాలంటే దేవాలయమునకు పోనక్కర్లేదు. సత్యమే ప్రత్యక్ష దైవము. సత్యము సర్వత్రా ఉన్నది. సత్యమే సర్వసంపదలను చేకూర్చుతుంది. కనుక, మీరు సత్య మార్గము నవలంబించాలి. ధర్మమును పోషించుకోవాలి. జ్ఞానమును అభివృద్ధి చేసుకోవాలి. జ్ఞానాభివృద్ధి నిమిత్తమై మీరు ఆహారమును సరియైనరీతిలో తీసుకోవాలి. దైవచింతనచేత అన్నమును దోషరహితం గావించుకోవాలి. "అన్నం బ్రహ్మ". అన్నమును బ్రహ్మస్వరూపంగా భావించాలి. "రసో విష్ణుః" అన్నము రసస్వరూపంగా మారి మన శరీరములో సర్వాంగములందు సంచరిస్తుంది. అదియే విష్ణుస్వరూపము. "భోక్తా దేవో మహేశ్వరః" భోక్తయే శివస్వరూపుడు. ఇలాంటి పవిత్రమైన భావాన్ని అభివృద్ధి పరచుకున్నప్పుడు మానవుడు శివస్వరూపమును ధరిస్తాడు.

శివస్వరూపమనగా ఏమిటి? శివుడు అన్నివిధాలా త్యాగ మయుడు. ఈ ప్రపంచములో ప్రతి మానవుడు తన దేహాన్ని అమితంగా ప్రేమిస్తాడు. కాని, శివునికి అట్టి దేహాభిమానము లేదు.

*మౌళి గుల్కెడు చంద్రమఃఖండ కళతోడ*
*బెడగారు గుంపెడు జడలతోడ*
*జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ*
*డంబైన ఫాలనేత్రంబుతోడ*
*నల్ల నేరెడువంటి నల్లని మెడతోడ*
*కరమున నాగ కంకణముతోడ*
*నడుమున చుట్టిన నాగచర్మముతోడ*
*మైనిండనలదు భస్మంబుతోడ*
*నుదుట దీర్చిన పెద్ద కుంకుమ బొట్టుతో*
*తాంబూల రాగాధరంబుతోడ*
*ఆరుశాస్త్రములందున నందగించి*

sri sathyasai vachanamrutam

*నల్ల కలువల హసియించి కొల్లలాడు*

*మెరుగు చామన ఛాయల మేనితోడ...*

దేదీప్యమానంగా తేజరిల్లే శివుడు సర్వసంగ పరిత్యాగియై దేహాభిమానమును త్యజించి, ఆత్మాభిమానమునందే లీనమై ఉంటాడు. ఒకపర్యాయం పార్వతీ దేవి, "ఈశ్వరా! దినదినము ఊరూరా తిరుగుతూ తిరుపమెత్తుటెగాని, తలదాచుకొనుటకొక కొంపలేదే! ఇట్టి కాపురము నేనెట్లు చేతు?" అన్నదట. అప్పుడు శివుడు పరమశాంతంగా, "పార్వతీ! ఇల్లు కట్టినంతమాత్రాన ప్రయోజన మేమిటి? అందులో మనకన్న ముందుగానే ఎలుకలు ప్రవేశిస్తాయి. ఎలుకల బాధనుండి తప్పించుకొనుటకై ఒక పిల్లిని సాకవలసి వస్తుంది. పిల్లికి పాలకోసం ఒక పెయ్య కావలసివస్తుంది. ఎందుకొచ్చిందీ సంసారమంతా? దీనిని మనం ఏమాత్రం ఆశించకూడదు", అని బోధించాడట.

**త్రికరణశుద్ధియే జ్ఞానము**

ఒకానొక సమయంలో విక్రమాదిత్యుడు ఒక గొప్పసభ ఏర్పాటు చేసి అక్కడ సమావేశమైన పండితులనుద్దేశించి, "బుద్ధి గొప్పదా? మేధస్సు గొప్పదా?" అని అడిగాడు. కొందరు పండితులు మేధస్సే గొప్పదన్నారు. కాని, విక్రమాదిత్యుడు అంగీకరించలేదు. "మేధస్సులో వ్యక్తియొక్క ప్రవర్తనను బట్టి కొన్నికొన్ని మార్పులుండవచ్చును. కాని, బుద్ధి చాలా పరిశుద్ధమైనది. 'బుద్ధిగ్రాహ్య మతీంద్రియం', మనము ఆశించే ఆత్మజ్ఞాన మంతా బుద్ధియందే ఇమిడియున్నది. కాబట్టి, మేధస్సుకంటే బుద్ధియే గొప్పది", అన్నాడు. జ్ఞానమంటే ఏమని చెప్పబడింది? త్రికరణశుద్ధియే జ్ఞానము. అందువలననే, The proper study of mankind is man అన్నారు. ఏమిటి Mankind అంటే? శరీరము, మనస్సు, కర్మల ఏకత్వమే మానవత్వము. మన దేహమును, మనస్సును, కర్మలను పరిశుద్ధం చేసుకోవాలి. ఇదియే త్రికరణశుద్ధి. ఇదియే జ్ఞానము. కాని, ఇట్లా మనము చేస్తున్నామా? ఎవరిమటుకు వారు ఆలోచించుకోవాలి. దీనికై పెద్దగా శ్రమపడనక్కరలేదు. మొదటిది శారీరక పరిశుద్ధత. పవిత్రమైన గంగానది సమీపములోనే ఉన్నప్పటికీ కొందరు స్నానం చేయరు. ఏమి ప్రయోజనం? అన్ని సౌకర్యములు, అనుకూలములు ఉన్నప్పటికీ పరిశుద్ధతకు ప్రయత్నించరు. అదియే సోమరితనము. అలాంటి వారిలో తమోగుణము వర్ధిల్లుతుంటుంది. తమోగుణము జంతులక్షణము. దానిని

srisathyasaivachanamrutam

పూర్తిగా నిర్మూలం గావించుకొని, మానవత్వాన్ని పెంచుకొని దానిని దైవత్వంగా మార్చుకోవాలి.

**పాత్రశుద్ధి - పదార్థశుద్ధి - పాకశుద్ధి**

ప్రేమస్వరూపులారా! మీరు ముఖ్యంగాచిత్తశుద్ధికోసం కృషి చేయాలి. చిత్తశుద్ధి ఒక్కటుండెనా, సర్వమూ సిద్ధిస్తుంది. చిత్తశుద్ధికై మీరు భుజించే ఆహారమునకు సంబంధించి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వంటవండే సమయములో పరిశుద్ధతను పాటించాలి; పవిత్రమైన భావాలతో వండాలి. కేవలం శారీరక పరిశుభ్రత ఉంటే సరిపోదు, మానసిక పరిశుభ్రతకూడా ఉండాలి. పూర్వకాలమునందు ఆచారబ్రాహ్మణులైనవారు తాము భుజించే ఆహారమును తమ పత్నులే వండాలికాని, ఇతరులు వండడానికి వీల్లేదనేవారు. ఎందుకంటే, గృహిణులైనవారు తమ గృహంలో ఉన్నవారందరి క్షేమాన్ని మనస్సులో తలచుకొని వంటచేస్తారు. అట్లుగాకుండా, వంటవారిని నియమించుకుంటే వారెలాంటి భావముతో వండుతారో ఎవరికి తెలుసు? భావము అపవిత్రంగా ఉంటే, వండే ఆహారము 'విషం'గా మారిపోతుంది. అంతేకాదు. వంట చేయడానికి ఉపయోగించే పదార్థములు న్యాయమైన మార్గములో సంపాదించబడినవై ఉండాలి. ఉదాహరణకు, భర్త ఇంటికి కూరగాయలు తెచ్చాడు. అయితే, ఏవిధంగా తెచ్చాడో ఏమిటో! తన అధికారబలముతో కూరగాయలను అమ్మేవారిని భయపెట్టి వాటిని అన్యాయంగా తెచ్చియుండవచ్చు. లేక, వాళ్ళు దొంగతనంగా సంపాదించిన కూరగాయలను కొనియుండవచ్చు. అటువంటి కూరగాయలనుపయోగించి వంటచేసినప్పుడు ఆహారము కలుషితమై 'విషం'గా మారిపోతుంది. దీనిని ఎవ్వరూ గుర్తించలేరు. నిత్య జీవితములో మనము తినే తిండివల్ల ఎన్నియో కర్మలను ఆచరిస్తున్నాము, ఎన్నియో దోషములకు గురి అవుతున్నాము.

**దైవార్పితమైన ఆహారము దోషరహితమౌతుంది**

ప్రేమస్వరూపులారా! మీరు భుజించే ముందు దైవమును చక్కగా ప్రార్థించండి. ఆహారమును దైవార్పితము గావించండి. అప్పుడది పరిశుద్ధమైపోతుంది. పరిశుద్ధమైన ఆహారము పవిత్రమైన జ్ఞానమును కల్గిస్తుంది. ఒకానొక సమయములో ఋషీకేశ్‌లో

srisathyasaivachanamrutam

శివానందాశ్రమము ప్రక్కన మరొక ఆశ్రమముండేది. అందులోఅనేకమంది సన్యాసులు నివసించేవారు. వచ్చినవారికందరికీ ఆ ఆశ్రమవాసులు ఉచితంగా చపాతీలిచ్చేవారు. వారిలో అత్యంత పవిత్రముగా జీవితము గడిపే ఒక సన్యాసి ఉండేవాడు. అదే ఊరిలో ఒక శేఠ్ నివసించేవాడు. ఆయన చాలా వృద్ధుడు. ఒక నిరుపేదవ్యక్తికి ధనాశచూపి తనకంటే వయస్సులో చాలా చిన్నదైన అతని కుమార్తెను పెండ్లి చేసుకున్నాడు. "నా తండ్రి నా జీవితాన్ని ఈవిధంగా పాడుచేశాడే", అని ఆ అమ్మాయి నిరంతరం ఏడుస్తూ ఉండేది. ఆ బాధను భరించలేక ఒకనాడు గంగానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణించిన 11వ రోజున ఆయన సమారాధన ఏర్పాటు చేశాడు. ఆసందర్భంగా ప్రతి ఆశ్రమానికి శ్రాద్ధభోజనం పంపించాడు. అయితే, పవిత్రహృదయుడైన ఈ సన్యాసి నివసించే ఆశ్రమంలో మాత్రం ఒక పద్ధతి ఉండేది. ఇంత డబ్బు ఇచ్చేస్తే వాళ్ళే వండుకొని తింటారు. ఆరోజున శేఠ్ ఇచ్చిన డబ్బుతో ఆశ్రమంలో వంట చేశారు. ఆ ఆహారమును అందరూ భుజించారు. సత్యమార్గము ననుసరించే ఈ సన్యాసి ఆ రాత్రి నిద్రపట్టక చాలా బాధపడుతూ వచ్చాడు. అతనికి స్వప్నంలో ఒక అమ్మాయి కనిపిస్తోంది. "ఏమిటిది? నాకెప్పుడూ ఇలాంటి చింతలేదే! నాలో విషయవాసనలు లేవే! నాకెందుకు ఇలాంటి స్వప్నము వస్తోంది?" అని చాలా బాధ పడ్డాడు. ధ్యానములో కూర్చున్నా అతనికి అదే దృశ్యం కనిపించ సాగింది. మరుసటిరోజు అతడు సచ్చిదానందుడనే గురువువద్దకు పోయి తనకు వస్తున్న స్వప్నముగురించి చెప్పాడు. "స్వామీ! నాకెందుకీ దృశ్యము కనిపిస్తున్నది?" అని అడిగాడు. ఆ గురువు, "నాయనా! నీవేమీ యోచన పెట్టుకోవద్దు. నేను విచారిస్తాన"ని చెప్పి, ఆ శేఠ్‌ని పిలిపించాడు. అతని భార్య ఎలా మరణించిందో తెలుసుకున్నాడు. తరువాత ఆ సన్యాసిని పిలిచి జరిగిన సంగతి తెలియజేశాడు. "నాయనా! ఆ సమారాధనలో నీవు భోజనము చేయడంవలన బలవంతంగా ప్రాణం తీసుకున్న అతని భార్య నీకు కనిపిస్తూ వచ్చింది. నీకు వస్తున్న దుస్స్వప్నమునకు గల కారణమిదే", అంటూ వివరించాడు. ఆనాటినుండి ఆ సన్యాసి భోజనముకూడా మానివేశాడు; పాలు, పళ్ళు తీసుకుంటూ కాలం గడిపాడు. దేహము నిలవాలంటే ఏదో ఒకటి తినాలి కదా! "భిక్షాన్నం దేహరక్షార్థం". క్రొత్త కారైనా పెట్రోలు వేయాలి కదా! పెట్రోలు వేయక కారు నడవదు. అదేరీతిగా, దేహాన్ని కాపాడుకునే నిమిత్తం కొంత ఆహారం తీసుకోవాలి. ఆ సన్యాసికి మళ్ళీ ఆ దృశ్యము కనిపించలేదు.

ఒక్కొక్క పర్యాయము మీకు కనిపించకూడని దృశ్యములు స్వప్నంలో కనిపిస్తుంటాయి. స్వప్నమునందేకాదు, ధ్యానమునందుకూడా అవి ప్రత్యక్ష మవుతుంటాయి. ఇది కేవలం ఆహారదోషమే. ఆహారమునుండి, ఆహారము సమకూర్చిన వ్యక్తినుండి ఇలాంటి దోషములు ఏర్పడుతుంటాయి. కనుకనే, ప్రాచీనకాలమునందు సదాచార సంపన్నులైన బ్రాహ్మణులు స్వయంపాకం చేసుకొనేవారు. దోషరహితమైన ఆహారమును మనము భుజించాలి. కాని, ఆహారము దోషరహితమైనదో కాదో తెలుసుకోవడం మనకు కష్టమౌతుంది. అందువలన భుజించుటకు పూర్వము,

*బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్*
*బ్రహ్మైవతేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా*

*అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః*
*ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్*

అని ప్రార్థన చేసి, తర్వాతనే భుజించాలి. అలా పరిశుద్ధమైన భావముతో మీరు భగవంతుణ్ణి ప్రార్థిస్తే ఆ అన్నం పరిశుద్ధమౌతుంది. ఈనాటినుండైనా మీరు భోజనం చేసే ముందు పవిత్రమైన ఈ మంత్రాన్ని ఉచ్చరించండి; ఎట్టి దోషములూ మీ హృదయంలో ప్రవేశించవు. "అన్నం బ్రహ్మ రసో విష్ణుః, భోక్తా దేవో మహేశ్వరః" ఇది త్రికరణశుద్ధిని కల్గిస్తుంది. త్రికరణశుద్ధియే జ్ఞానము. మీరు ఏ సాధనలూ చేయకపోయినా ఫరవాలేదు. అనేకమంది ఏవో సాధనలు చేస్తుంటారు. కాని, ఆ సాధనలన్నీ తాత్కాలికమైన మానసికతృప్తికోసమే! మీరు శాశ్వతమైన ఆనందమును అనుభవించాలి.

ప్రేమస్వరూపులారా! అన్నింటికంటే ఋతము చాలా గొప్పది. ఇది త్రికాలాబాధ్యమైనది. అనగా, భూతభవిష్యద్వర్తమానములందు మార్పు చెందనిది. అదియే నిజమైన జ్ఞానము. కాలానుగుణ్యముగా మార్పుచెందేది 'మారకము'. ఎట్టి సమయమునందైనా మార్పుచెందక శాశ్వతముగా నిలిచేది 'తారకము'.

**తారకము సూటెరుగవలెనన్నా**
**సద్గురుని కృపచే తారతమ్యము తరచికనుమన్నా**
**మరపు తెరపడకుండ నిరతము**
**జాగ్రత్ స్వప్నా సుషుప్తిలో**

sri sathyasaivachanamrutam

**అరమరలు లేకుండ యెప్పుడు**
**తరచుగను జీవాత్మ చదివెడి ॥తా॥**

ఏ మతమువారైనను, ఏ కులమువారైనను ఈ తారకమంత్రమును తెలుసుకోవాలి.

**దైవముతో స్నేహము చేయాలి**

ఈనాడు చాలామంది భక్తులమని చెప్పుకుంటూ అసత్యములో అడుగుపెడుతున్నారు, అధర్మంగా ప్రవర్తిస్తున్నారు. వారు ప్రదర్శించే ప్రేమ స్వార్థస్వప్రయోజనాలతో నిండియుంటున్నది. బాహ్యంగా చూస్తే మంచిగా కనిపిస్తారు. కాని, లోపలంతా మాలిన్యమే! ధనముకోసం తమ జీవితాన్నే నాశనము చేసుకుంటున్నారు. ఇలాంటివారు మహాపాపులు. వారి ముఖముకూడా మనము చూడకూడదు.

**"శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్"**

అని భాగవతంలో నవవిధ భక్తితత్త్వములనుగురించి చెప్పారు. ఇందులో స్నేహమనేది చాలా విశిష్టమైనది. ఆత్మనివేదనమునకు ముందుగా ఉన్న మెట్టు స్నేహమే. కనుక, మీరు దైవంతో స్నేహం చేయాలి. ఆ స్నేహం ఒక్కట్టుంటే చాలు, ప్రపంచమంతా మీ హస్త గతమవుతుంది. కాని, ఉన్న స్నేహాన్నికూడా ఊడగొట్టుకుంటున్నారు దురదృష్టవంతులు. దైవంతో స్నేహం సామాన్యంగా లభించేది కాదు. దానిని మీరు సంపాదించుకోవాలి. సంపాదించుకున్న స్నేహాన్ని తగిన సాధనతో సార్థకము చేసుకోవాలి. వట్టి మాటలతో కాలమును వ్యర్థం చేయకూడదు.

**సత్యవ్రతముచేత సర్వేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు**

ప్రేమస్వరూపులారా! మీరీనాడు ప్రత్యేకంగా నేర్చుకోవలసినది సత్యమును పలకడం. సత్యమే మన జీవితానికి ఆధారము. సత్యమే ప్రత్యక్ష పరమాత్మ. ముఖ్యంగా మీరిక్కడికి వచ్చి స్వామి సంభాషణను విన్నందుకు మీ జీవితాలలో కొంతైనా మార్పు తెచ్చుకోవటం చాలా అవసరం. విదేశాలనుండి అనేకులు ఇక్కడికి వస్తున్నారు. సమయం చిక్కితే చాలు, ప్రశాంతి నిలయం వెళ్ళి స్వామిని దర్శించుకోవాలని కాచుకొని ఉంటారు. అలాంటి ఛాన్సు మీకుచిక్కింది. దీనిని మీరు సార్థకము చేసుకోవాలి. ఎలాంటి పరిస్థితిలోనైనా

sri sathyasaivachanamrutam

అసత్యమాడవద్దు. ఒక్కొక్క పర్యాయము సత్యము చెప్పడంవలన ప్రమాదం జరగవచ్చు. అలాంటి పరిస్థితిలో సత్యమూ చెప్పవద్దు; అసత్యమూ చెప్పవద్దు; మౌనం వహించండి. మౌనంచేత సర్వకార్యములు సిద్ధిస్తాయి. సత్యం చెబితే అపకారం జరుగుతుందేమో అని భయపడవద్దు. అసత్యం చెబితే నేను పాపినౌతానేమో అని భయపడవద్దు. అలాంటి పరిస్థితిలో మౌనం వహించండి; సత్యాసత్యములు రెండింటికీ అతీతంగా ఉండండి. సాధ్యమైనంతవరకు మీ జీవితమును సత్యమార్గములో ప్రవేశపెట్టండి. కొంతమంది, "స్వామీ! మీ పుట్టినరోజు పండుగకు రావాలనుకుంటే సెలవు చిక్కడం లేదు. కాబట్టి, 'సిక్ లీవ్' పెట్టి వస్తామ"న్నారు. "అది మంచిది కాదు, నీవు రాకపోయినా మంచిదే కాని, అసత్యము చెప్పవద్దు", అని నేను చెప్పాను. సత్యవ్రతమును ఆచరించండి. సత్యవ్రతముచేత మీకు సర్వేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు. సత్యవ్రతముచేత మనం దివ్యత్వమును పొందాలి. ప్రార్థనలచేత పవిత్రతను పొందాలి. జ్ఞానతత్త్వాన్ని మనం అభివృద్ధిపరచుకోవాలంటే ప్రార్థన అత్యవసరము. అదియే "అన్నం బ్రహ్మ రసో విష్ణుః భోక్తా దేవో మహేశ్వరః" ఇంతకంటే ఏమి కావాలి? ఈ ప్రార్థనకు ఏమాత్రం శ్రమపడవలసిన అవసరం లేదు.

విద్యార్థులారా! మీరు యువకులు కాబట్టి, Start early, drive slowly and reach safely. ఈ చిన్నవయస్సులోనే మీరు ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించాలి. అప్పుడే మీ జీవితము సార్థకమౌతుంది.

**నాకు నిత్యమూ పండుగే!**

నా పుట్టిన పండుగను జరుపుకోవాలని నేను ఎన్నడూ ఆశించ లేదు. ఎంతోమంది భక్తులు ఎన్నో ప్రోగ్రాములు ఏర్పాటు చేయాలని ఆశించారు, అనుమతించవలసిందిగా కోరారు. వాటినన్నింటినీ తిరస్కరించాను. ఈనాడు ప్రజలు విశేషసంఖ్యలో వచ్చినారు కనుక, ఇంతమాత్రమైనా ఏర్పాటు చేయవలసివచ్చింది. లేకపోతే, నాకివన్నీ జరపాలనే కోరికే లేదు. ఈ పండుగ చేసుకోవాలనే ఆశే నాకు లేదు. నాకు నిత్యమూ పండుగే. నేను నిత్యానందుడను. ఆనందము ఇతరులు ఇచ్చేది కాదు నాకు. ఇతరులిచ్చే ఆనందముకోసం నేను కాచుకోను. ఆనందము నాలోనే ఉంది.

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్**
**ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యమ్**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీ సాక్షిభూతమ్**
**భావాతీతం త్రిగుణ రహితం............**

నేను గుణాతీతుడను. నేనేది చేసినా మీ క్షేమంకోసమే; మీ పవిత్రత కోసమే; మీ ఆనందముకోసమే. మీరు నిరంతరం ఆనందంగా ఉండండి; దోషరహితులై జీవించండి. అదే నాకు ముఖ్యమైనది. నాకెప్పుడూ, ఎక్కడా, ఏవిధమైన బాధలూ కలుగవు. నాకేవిధమైన విచారమూ లేదు; ఎలాంటి చింతా లేదు; ఆశలు లేవు. నేను ఏది చేసినా, ఏది చెప్పినా మీ నిమిత్తమే. Whatever I tell, whatever I do, is good for you, good for you. అసలు నేనే మీకోసం ఉన్నాను. నాకంటూ కావలసినదేదీ లేదు. కాబట్టి నన్ను ఉపయోగపెట్టుకోండి. నేను ఎప్పుడూ సిద్ధమే. కాని, మీరు పవిత్రమైన భావాలు పెంచుకోవాలి; దివ్యమైన జీవితాన్ని గడపాలి. ఇదియే ముఖ్యమైనది. ఏ తప్పు జరిగినా అందుకు కారణం మీలో వచ్చే భావములే. నేను కొన్ని సమయాల్లో మౌనం వహిస్తాను. "స్వామి మా దోషాలను చూసి మాతో మాట్లాడడం లేదు, మౌనం వహించారు", అని మీరనుకుంటారు. అట్టి భావన మీ భ్రమయే. నాకు దోషములను వెతికే స్వభావము ఎప్పుడూ లేదు. నా నేత్రములు పరిశుద్ధమైనవి. కనుక, నేనెప్పుడూ పరిశుద్ధమునే చూస్తానుకాని, అశుద్ధము ప్రక్కనున్నా చూడను. చెడుకూడా నాకు మంచిగా కన్పిస్తుంది. స్వామి విషయంలో సందేహాలకు ఏమాత్రం అవకాశము ఇవ్వకండి. "సంశయాత్మా వినశ్యతి". కనుక, నిస్సంశయులై, దృఢచిత్తులై ఉండండి.

ప్రేమస్వరూపులారా! అతిథులను గౌరవించండి. అందరికీ మీ ప్రేమను పంచండి. మీరు తినే తిండిలో కొంతభాగమైనా వారికి పెట్టండి. అప్పుడే మీకు మనశ్శాంతి లభిస్తుంది. జ్ఞానమంటే ఏదో ప్రత్యేకమైనది కాదు. త్రికరణశుద్ధి కావాలి. ఋతమును మీరు పోషించుకోవాలి. ఇదియే నిజమైన జ్ఞానము. ఇంతకంటే ఇంకేమి కావాలి? తారకమును ఆశించండి; మారకము వద్దు. మధ్యమధ్య మీ విశ్వాసమును మార్చుకుంటే, మీకంటే దురదృష్టవంతులు ఈ ప్రపంచములో మరొకరుండరు. చంచలత్వమనేది Monkey mind లక్షణం. మీరు Mankindకు చెందినవారు. మీరు మానవులై పుట్టారు. కనుక,

Monkey mind కు అవకాశమివ్వకండి.

ప్రేమస్వరూపులారా! ఈ పుట్టిన దినమునాడు మీరు క్రొత్తగా నేర్చుకోవలసినది ఒకటుంది. అదేమిటంటే, పవిత్రమైన కాలమును వృథా చేయవద్దు. వృథా చేసిన కాలమును తిరిగి మీరు సంపాదించుకోలేరు. ఈ పుడమిలో ప్రభవించిన ప్రతి మానవునికి సత్యమే ప్రత్యక్ష పరమాత్మ. "సత్యాన్నాస్తి పరోధర్మః" అన్నారు. కనుక, మీరు సత్యాన్ని అనుసరిస్తూరండి.

***సత్యధర్మము శాంతిప్రేమలతో***
**నీ నిత్యజీవనయాత్ర సాగించు జీవా!**
**యత్న ప్రయత్నముల్ మానవధర్మము**
**జయాపజయములు దైవాధీనము ॥సత్య॥**

**మానవధైర్యము మంచి ఎరువుగ**
**ప్రేమధారలే పంట విత్తులుగ**
**భక్తే వర్షము భావమె కలుపులు**
**నిత్యానందమె పండెడు పంట ॥సత్య॥**

(**2002** నవంబరు **23**వ తేదీ ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

sri sathyasaivachanamrutam